క్లుప్తంగా

తుమ్మలయ్య కొండలో ప్రత్యేక పూజలు

అమడగూరు: మండలంలోని తుమ్మలయ్య కొండలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటరమణ స్వామిని కొలిచే భక్తులు భక్తి శ్రద్ధలతో ఉపావాసంతో కొండను ఎక్కి పూజలు చేశారు. ఏటా అక్టోబర్ నెలలో ఉపవాస ఒక్కపొద్దులను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే చివరి శనివారం భక్తులు, పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో కొండను ఎక్కి స్వామిని దర్శించుకున్నారు.

రేపటి నుంచి లక్ష్మీదేవి కటాక్ష హోమం


తాడిమర్రిలో పూజలందుకున్న చౌడేశ్వరి అమ్మవారు

తాడిమర్రి: స్థానిక కుండలిని శక్తి పాత్ సిద్ధ మహాయోగ చౌడేశ్వరి, రద్యాదేవి ఆశ్రమంలో సోమవారం నుంచి ఆరు రోజుల పాటు లక్ష్మీదేవి కటాక్ష నిత్యహోమం, యజ్ఞం నిర్వహిస్తామని గురుమాత రమ్యాదేవి శనివారం తెలిపారు. ఈనెల 28 నుంచి నవంబర్ 2 వరకూ తనతోపాటు శివానంద స్వామి హోమం నిర్వహిస్తారన్నారు. చివరి రోజున దాతల సహకారంతో అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరాఉ. అంతకుముందు చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమయపాలన పాటించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నల్లచెరువు: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆదేశించారు. కె.పూలకుంట సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులు, ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ విధానాన్ని పాటించాలన్నారు. గ్రామాల్లో విషజ్వరాల కేసులు ఉన్నాయని వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా రామాంజనప్ప


రామాంజనప్పకు నియామక ఉత్తర్వులు అందిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బీచిగానిపల్లి రామాంజనప్పను ఎంపిక చేసినట్లు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అండ్ ఎంప్లాయిమెంట్ అధికారి శివరంగప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం రామాంజనప్పకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనప్ప మాట్లాడుతూ కమిటీ సభ్యునిగా నియమించినందుకు మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ చేతన్, బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామక్రిష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చర్యలు

బత్తలపల్లి: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తోపుడు బండ్ల నిర్వాహకులకు హెచ్చరించారు. శనివారం బత్తలపల్లి కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగే ప్రాంతాలను సిబ్బందితో కలిసి ఎస్ఐ పర్యటించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు అడ్డుపెట్టిన వాహనదారులకు ఆయన జరిమానా విధించారు.

డిమాండ్లు తీర్చాలి


నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న వైద్య మిత్రలు

కదిరి టౌన్: తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వైద్య మిత్రలు శనివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ డివిజన్ నాయకులు తలమర్ల హరికుమార్, అమరేంద్ర మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ అధికారులు, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించని పక్షంలో ఈ నెల 29 నుంచి పూర్తి స్థాయి సమ్మె చేస్తామన్నారు.

రూరల్‌లో లైసెన్స్.. టౌన్‌లో దుకాణం!

- మద్యం షాపుల ఏర్పాటులో నిబంధనల ఉల్లంఘన
- జనావాసాల్లో మద్యం దుకాణాలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు


బత్తలపల్లి గంగమ్మ ఆలయ సమీపంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణం(వృత్తంలో)



ధర్మవరం రూరల్ ప్రాంతంలో లైసెన్స్ పొంది మున్సిపాలిటి పరిధిలోని 32వ వార్డులో మద్యం దుకాణం నిర్వహిస్తున్న దృశ్యం


శివానగర్‌లో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

ధర్మవరం: మద్యం దుకాణాల ఏర్పాటులో కూటమి పార్టీల నాయకులు యథేచ్ఛగా ప్రభుత్వ నిభందనలను ఉల్లంఘిస్తున్నారు. గుడి, బడి అన్న తేడా లేకుండా జనావాసాల మధ్యలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో తాగుబోతుల వీరంగం...ప్రజలకు అసౌకర్యం నిత్యకృత్యమయ్యాయి. మరో కూటమి నాయకుడైతే ఏకంగా రూరల్ ప్రాంతంలో మద్యం దుకాణం లైసెన్స్ పొంది పట్టణ ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్నాడు. అయితే నిజాలు అన్ని తెలిసినప్పటికి కూడా చర్యలు చేపట్టడంలో అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ధర్మవరం నియోజకవర్గంలో ధర్మవరం, తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో మొత్తం 20 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేలాగా ప్రభుత్వం టెండర్లు వేసి లాటరీ ద్వారా దుకాణాదారులను ఎంపిక చేసింది. వీరిలో 80 శాతం మందికి పైగా కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకే దక్కేలాగా ప్లాన్ వేసి ఇతరులు ఎక్కువగా టెండర్లు వేయకుండా దౌర్జన్యం చేసి ఆయా షాప్‌లు దక్కించుకున్నారు.

నిబంధనలు బేఖాతర్

నియోజకవర్గంలోని 20 షాపుల్లో 16 షాపుల దాకా కూటమి పార్టీల నాయకులకే దక్కాయి. మద్యం దుకాణాల ఏర్పాటులో నిబంధనలు బేఖాతర్ చేస్తూ ఏర్పాటు చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలో జనావాసాల మధ్యలో వైన్స్ షాపు ఏర్పాటు చేశారు. అలాగే కొత్తపేట శివాలయం వద్ద, జనావాసాల మధ్యలో మరో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. అలానే బత్తలపల్లిలో గంగమ్మ తల్లి ఆలయ సమీపంలో రెండు మద్యం దుకాణాలను టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో జనావాసాల మధ్య నివశించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచే మందుబాబులు వీరంగం సృష్టించడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లైసెన్స్ ఓ చోట.. దుకాణం మరో చోట

ధర్మవరం రూరల్ ప్రాంతంలో మద్యం లైసెన్స్ పొందిన కూటమి నాయకులు స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డు గిర్రాజు కాలనీలోని అన్నపూర్ణేశ్వరి దేవాలయం సమీపంలో మద్యం షాప్ నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులపై బీజేపీ నాయకులు ఒత్తిళ్లు తీవ్రతరం చేయడంతో అధికారులు మిన్నకుండిపోయినట్లుగా సమాచారం. సాధారణంగా తటస్థులైన మద్యం వ్యాపారులకు అనేక నిబంధనలు, షరతులు పెట్టే అధికారులు కూటమి పార్టీల నాయకులు ఎన్ని నిబంధనలు ఉల్లంఘించినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణ

ఎన్పీకుంట: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఏడీఏ సత్యనారాయణ పేర్కొన్నారు. వెలిచలమల రైతు సేవా కేంద్రంలో సమాచారహక్కు చట్టంపై గాండ్లపెంట, ఎన్.పీ.కుంట మండలాల్లోని రైతుసేవాల కేంద్రం సిబ్బంది, రైతులకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ సమాచార హక్కు చట్టం సెక్షన్ 6, 7(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో అడిగిన సమాచారాన్ని సంబంధిత అధికారి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సెక్షన్ 4(1)(బి) ప్రకారం కార్యాలయ ఆవరణలో సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో సమాచార అధికారి, సహాయ సంచార అధికారి, అపిలెట్ అథారిటీల పేర్లు, మొబైల్ నంబర్లు విధిగా ప్రదర్శించాలని తెలిపారు. సెక్షన్ 20(1, 2) ప్రకారం సమాచారం పూర్తి స్థాయిలో ఇవ్వని సందర్భంల్లో సంబంధిత అధికారిపై జరిమానా, క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు సమాచారహక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండి అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వ అధికారులు, సంస్థల నుంచి పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు లోకేశ్వరరెడ్డి, లక్ష్మీప్రియ, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు పట్టాలు ఇవ్వాలి


జేసీబీతో పునాదులు తవ్వుతున్న దృశ్యం

ధర్మవరం రూరల్: పట్టణంలోని తుంపర్తి కాలనీ కోసం భూములు కోల్పోయిన రైతులకు రిజర్వ్ స్థలాల్లో ఇంటి పట్టాలు ఇవ్వాలని తుంపర్తి రైతులు డిమాండ్ చేశారు. శనివారం కాలనీలోని రిజర్వ్ స్థలాల్లో కొంత మంది కూటమి కార్యకర్తలు దౌర్జన్యంగా ఇంటి నిర్మాణాల కోసం జేసీబీతో పునాదులు తవ్వుతుండగా తుంపర్తి రైతులు అడ్డుకున్నారు. రైతుల సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకొని రిజర్వ్ స్థలాల్లో ఎవ్వరికి ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తవ్విన పునాదులను జేసీబీతో పూడ్చివేశారు. రిజర్వ్ స్థలాల్లో భూములు ఇచ్చిన రైతులకు మాత్రమే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రైతులు అధికారులను కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూములు ఇచ్చిన రైతులందరికీ రహదారి పక్కనే ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం మారడంతో తమను పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దు


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ వలిబాషా

ఎన్పీకుంట: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని ఎస్ఐ వలిబాషా ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రం సమీపంలోని కొత్తరోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. రోడ్డు నిబంధనలపై ఆటోడ్రైవర్లకు పలు సూచనలు చేశారు. జమేదార్ ఆజాద్, సిబ్బంది ఉన్నారు.

కలసిమెలసి బతకండి


గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో కక్షల జోలికిపోకుండా ప్రజలంతా కలిసి మెలిసి బతకాలని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. శనివారం ముచ్చురామి గ్రామంలో ప్రజలతో ఎస్ఐ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ కక్షలు పెట్టుకోవద్దన్నారు. సమస్యలుంటే సంబంధిత అధికారుల వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆడపిల్లలకు భద్రత కరువు


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం రూరల్: కూటమి ప్రభుత్వంలో ఆడపిల్లలకు భద్రత లేకుండా పోతోందని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా మహాసభల ప్రారంభ సూచికగా శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న, దిల్షాద్, సభ్యులు మారుతి, ఎస్‌హెచ్ బాషా, అయూబ్‌ఖాన్, నాగార్జున, ఆదినారాయణ, హరి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవడం లేదన్నారు. ఇసుక విధానంలో లోపాలున్నాయన్నారు. రాష్ట్రంలో గంజాయి, మద్యం విక్రయాలు అధికం కావడంతో మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. కరెంట్ చార్జీల విషయంలో సర్దుబాటు పేరుతో రూ.6 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నికల హామీలను నెరవేర్చకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం


మొక్కలు నాటుతున్న దృశ్యం

ధర్మవరం రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో ధర్మవరం సైక్లింగ్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రీస్ ఫర్ టుమారో కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటే బాధ్యత తీసుకుంటే పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించిన సూర్యనారాయణను కమిషనర్ సన్మానించారు. ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్ నాయక్, ప్రధానోపాధ్యాయులు కుళ్లాయప్ప, ముస్తాక్ అహమ్మద్, డీసీవీసీ గౌరవాధ్యక్షుడు గోరకాటి పెద్దారెడ్డి, అధ్యక్షుడు బాబా పక్రుద్దీన్, సెక్రటరీ జబీవుల్లా, జాయింట్ సెక్రటరీ ఉదయ్, కోశాధికారి ఓం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం కోసం స్థలం కొనుగోలు


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నారాయణస్వామి

ముదిగుబ్బ: రామస్వామి తండాలో శ్మశానం కోసం స్థలాన్ని కొనుగోలు చేయనున్నట్లు తహసీల్దార్ నారాయణస్వామి పేర్కొన్నారు. శనివారం తండాలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ స్థలం కొనుగోలుపై రైతులతో చర్చించారు. స్థలం విక్రయానికి రైతులు అంగీకరించారు. త్వరలో స్థలం కొనుగోలు చేసి శ్మశానానికి కేటాయిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన లింగన్న, ఎర్రిస్వామి శనివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా క్రిష్ణాపురం గేటు సమీపంలో ఆటో ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరి 108 ద్వారా బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

ఎన్పీకుంట: కొండలవాండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా మండపారాధనా, మూల మంత్ర జపాలు, యంత్రాలకు అభిషేకం, హోమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున సీతారాముల విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పోలీసులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు


పోటీలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు

పుట్టపర్తి టౌన్: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా డీపీఓ సమీపంలోని స్నేహప్రియ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాలు ఎదుర్కోవడంలో సాంకేతిక ప్రభావం అనే అంశాలపై పోటీలు జరిగాయి. పోటీలను అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పరిశీలించారు. విజేతలకు పోలీసు అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా నగదు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, సీఐలు తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు గొట్లూరు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

ధర్మవరం రూరల్: స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గొట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, పీడీ రాఘునాథరావు శనివారం తెలిపారు. జిల్లా హాకీ జట్టుకు అండర్-14 బాలికల విభాగంలో హేమశ్రీ, కమలాక్షి, విజయ్, అండర్-17 బాలుర విభాగంలో జస్వంత్, రవితేజ, అలాగే బాలికల విభాగంలో తేజశ్రీ, భవాని, ప్రేమలత, కబడ్డీలో పవన్ ఎంపికయ్యారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, పీడీ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభచాటాలని ఆకాంక్షించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బత్తల వెంకటరమణ

కదిరి అర్బన్: సున్నపుగుట్టతండాలో శనివారం కృష్ణానాయక్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. మృతునికి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బత్తల హరిప్రసాద్ రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని తన తండ్రి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో రాజునాయక్, శ్రీనివాసులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి

బత్తలపల్లి: గొడవలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సోమశేఖర్ ప్రజలకు సూచించారు. సమస్యాత్మక గ్రామమైన వెంకటగారిపల్లిని శనివారం ఎస్ఐ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని, అందరూ అన్నదమ్ముల వలే కలిసి జీవించాలని ఆయన సూచించారు. ఎలాంటి రాజకీయ కక్షలకు వెళ్లవద్దన్నారు. కక్షలకు పోతే వారి పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. పిల్లలను బాగా చదివించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పూలతోట.. లాభాల బాట

- మార్కెట్లో ఆశాజనకంగా ధరలు


ద్వారనాల వద్ద సాగైన బంతిపూల తోట


చామచేనుబైలు వద్ద సాగవుతున్న చామంతి తోట

గాండ్లపెంట: తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలనిచ్చే పూలతోటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. సంప్రదాయ పంటలు సాగు చేసి వివిధ రకాల కారణాలతో నష్టాలు చవిచూసిన రైతులు ప్రత్యామ్నాయంగా పూల సాగును ఎంచుకుంటున్నారు. నియోజకవర్గంలోని కదిరి, తనకల్లు, తలుపుల, ఎన్పీకుంట, నల్లచెరువు, కదిరి మండలాల్లోని రైతులు 80 ఎకరాల విస్తీర్ణంలో పూల తోటలు విస్తరించాయి. సీజన్‌ను బట్టి బంతి, నాటీ బంతి, చామంతి తదితర పూలతోటలు సాగు చేస్తున్నారు.

పెట్టుబడి తక్కువే

పూల సాగుకు ఖర్చు తక్కువే. చామంతి, బంతి తదితర రకాలు ఎకరాకు 10 వేల నుంచి 12 వేల మొక్కలు అవసరమవుతాయి. మొక్కలు, ఎరువులు, దుక్కులు, కూలీలు, మందుల ఖర్చులు కలిపి మొత్తం 35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈ నెలలో దసరా పండుగకు కిలో బంతి పూలు రూ.50 నుంచి రూ.70 వరకు ధర పలికింది. ఇక చామంతి పూలు కిలో రూ.80 నుంచి రూ.100 దాకా పలికింది. ప్రస్తుతం బంతిపూలు రూ.30 నుంచి రూ.40, చామంతి రూ.50 నుంచి రూ.70 దాకా ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు.

ఆదాయం బాగుంది



నేను 1.10 ఎకరాల విస్తీర్ణంలో బంతి పూలు సాగు చేశాను. రూ.35 వేల దాకా పెట్టుబడి పెట్టాను. మొదటి కోతలో రోజుకు 250 కిలోల నుంచి గరిష్ఠంగా 450 కిలోల వరకు దిగుబడి వచ్చింది. హైదరాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించాను. ప్రస్తుతం దిగుబడి తక్కువగా ఉన్నందున కదిరి మార్కెట్‌లో విక్రయిస్తున్నా. ఖర్చులు పోను రోజువారి ఆదాయం రూ.800 నుంచి రూ.1000 వరకు సమకూరుతోంది.

– రైతు ఎం.లక్ష్మీనారాయణ, గాండ్లపెంట

ధర పెరిగే అవకాశముంది



అర ఎకరా విస్తీర్ణంలో వైలెట్ చామంతి రకం పూల మొక్కలు నాటాను. దసరా పండుగ సమయంలో దిగుబడి రాలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో చామంతి పూలు రూ.20 నుంచి రూ.30 ధర పలుకుతోంది. దీపావళి పండుగకు మంచి ధర వచ్చే అవకాశముంది.

– రైతు బయ్యారెడ్డి, చామచేనుబైలు

జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు పూల తోటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. చీడపీడల నుంచి రక్షించుకునేందుకు సీఓసీ కాపరాక్సిన్ క్లోరైడ్ 3 గ్రాములు, ఫార్ములా-4 మూడు గ్రాములు, 13045- మందును 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

– ప్రతాపరెడ్డి, హార్టికల్చర్ అధికారి

‘వేధింపులు తాళలేకే ఆత్మహత్య’

తనకల్లు: మారెప్పగారిపల్లికి చెందిన నరసింహులు, అతని కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేకే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలు. నాలుగేళ్ల క్రితం మృతుడు వెంకటరమణ కుమార్తెకు టీడీపీ నేత నరసింహులు కుమారుడు మహేష్ ప్రేమలేఖ రాశాడు. దీనితో వెంకటరమణ విషయాన్ని గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో వారు మహేష్‌ని మందలించారు. అప్పటి నుంచి వెంకటరమణ కుటుంబంపై నరసింహులు కుటుంబం కక్ష పెంచుకొని తరచూ గొడవ పడుతుండేవారు. గత గురువారం కూడా మరోమారు రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. మనస్థాపం చెందిన వెంకటరమణ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణను తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు నరసింహులు, భార్య నరసమ్మ, మహేష్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.